


నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION
www.suryaa.com పేజీలు: 02
4 PM



## ఇప్పటి వరకు భారతరత్న అందుకున్న ప్రధానులు వీరే.!

భారత అత్యున్నత పౌర పురస్కారం భారతరత్నను కేంద్రం ప్రభుత్వం మాజీ ప్రధానులు పీవి నరసింహరావు, చరణ్ సింగ్ లకు ప్రకటించింది. ఇప్పటివరకు మన దేశానికి 14 మంది పూర్తి స్థాయి ప్రధానులుగా సేవలు అందించారు. వీరిలో 8 మంది భారతరత్న పురస్కారానికి ఎంపిక అయ్యారు. జవహర్ లాల్ నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి (మరణానంతరం), ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ (మరణానంతరం), మొరార్జీ దేశాయ్, వాజ్ పేయిలకు గతంలోనే ఈ అవార్డు దక్కింది. తాజాగా పీవీ, చరణ్ సింగ్ వారి సరసన నిలిచారు. ప్రస్తుత ప్రధాని మోదీ, మాజీ ప్రధానులు వీపీ సింగ్, చంద్రశేఖర్, హెచ్డీ దేవేగౌడ, ఐకే గుజ్రాల్, మన్మోహన్ సింగ్ లకు భారతరత్న ఇంకా దక్కలేదు.



## ఇంగ్లాండ్‌తో మూడు టెస్టులకు భారత్ జట్టు ప్రకటన

ఇంగ్లాండ్‌తో మిగిలిన మూడు టెస్టు మ్యాచ్‌లకు భారత జట్టును బీసీసీఐ సెలక్షన్ కమిటీ ప్రకటించింది. అనుకున్నట్లుగానే విరాట్ కోహ్లీ సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. గాయం కారణంగా రెండో టెస్టుకు దూరమైన కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా తిరిగి జట్టులోకి వచ్చారు. సిరాజ్ కూడా మిగతా టెస్టులకు వచ్చేశాడు. కొత్తగా ఆకాశ్ దీప్ టెస్టుల్లోకి ఎంపికయ్యాడు. రజత్, సర్ఫరాజ్ ఖాన్ తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. గాయం కారణంగా శ్రేయస్‌ను ఎంపిక చేయలేదు. ఇషాన్ కిషన్, మహమ్మద్ షమీని పరిగణనలోకి తీసుకోలేదు. రెండో టెస్టు స్క్వాడ్‌లో ఉన్న అవేశ్ ఖాన్, సౌరభ్ కుమార్‌ను సెలక్టర్లు పక్కన పెట్టారు. ఐదు టెస్టుల సిరీస్‌లో భారత్-ఇంగ్లాండ్ 1-1తో సమంగా నిలిచాయి.

**తుది జట్టు:**

రోహిత్ శర్మ (కెప్టెన్), జస్ప్రీత్ బుమ్రా (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, శుభమన్ గిల్, కేఎల్ రాహుల్, రజత్ పటీదార్, సర్ఫరాజ్ ఖాన్, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), కేఎస్ భరత్ (వికెట్ కీపర్), రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, కుల్‌దీప్ యాదవ్, సిరాజ్, ముకేశ్ కుమార్, ఆకాశ్ దీప్‌ల

## రేపటి నుంచి లోకేశ్ శంఖారావం యాత్ర




రేపటి నుంచి నారా లోకేశ్ ఉత్తరాంధ్ర పర్యటన ప్రారంభం కానుంది. శంఖారావం పేరుతో ఈ యాత్రను ఆయన చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పార్టీ నేతలు చేశారు. ఈరోజు రాత్రికి లోకేశ్ శ్రీకాకుళంజిల్లా ఇచ్ఛాపురానికి చేరుకుంటారు. రాత్రికి అక్కడే బస చేస్తారు. రేపు ఉదయం నుంచి శంఖారావం యాత్ర ప్రారంభం కానుంది. మొత్తం 120అసెంబ్లీ నియోజకవర్గాల్లో శంఖారావం యాత్ర జరపనున్నారు.

## 8.25 శాతానికి పెరిగిన ఈపీఎఫ్ వడ్డీ రేటు



శాతంగా ఖరారు చేసినట్లు ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం (2022-23) ఇది 8.15 శాతంగా ఉంటే, అంతకుముందు ఆర్థిక ఏడాది (2021-22) 8.10 శాతంగానే ఉన్నది. దీంతో గత మూడేండ్లలో ఇదే అత్యధిక వడ్డీ రేటుగా నిలిచింది. కాగా, స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులను పెంచేందుకు బోర్డు నుంచి ఈపీఎఫ్‌వో అనుమతుల్ని కోరే వీలున్నది. ప్రస్తుతం 10 శాతంగా ఉన్న పెట్టుబడుల పరిమితిని 15 శాతానికి పెంచాలన్నది ఈపీఎఫ్‌వో యోచన. దీనివల్ల పీఎఫ్ సొమ్ముపై మరింత రాబడులు అందుకోవచ్చంటున్నది. దీనిపై ట్రస్టీలు ఎలా స్పందిస్తారో చూడాల్సిందే. ఈపీఎఫ్‌వోలో 6 కోట్లకుపైగా సభ్యులున్నారు.

## ఇంజెక్షన్ వికటించి.. ఏడుగురు చిన్నారులకు అస్వస్థత



ఇంజెక్షన్ వికటించి ఏడుగురు చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని సర్వజన ప్రభుత్వ ఆస్పత్రి పిల్లల విభాగంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పిల్లల విభాగంలో మొత్తం 15 మందికి చికిత్స ఇస్తున్నారు. రోజూ మాదిరిగానే శుక్రవారం రాత్రి ఇంజెక్షన్ చేశారు. అర గంట తర్వాత చిన్నారులకు విపరీతమైన చలి జ్వరం రావడంతో వైద్యులు అప్రమత్తమయ్యారు. వీరిలో ఏడుగురిని ఐసీయూకు తరలించి వైద్యం అందిస్తున్నారు. ప్రస్తుతం అందరి పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

## తమిళనాడులో ఎన్ఐఏ సోదాలు




తమిళనాడులో ఎన్ఐఏ సోదాలు కొనసాగుతున్నాయి. తమిళనాడు వ్యాప్తంగా దాదాపు 25 ప్రాంతాల్లో సోదాలు జరుగుతున్నాయి. కాగా, తమిళనాడులో కారుబాంబు కేసుకు సంబంధించి ఈ సోదాలు జరుగుతున్నట్టు సమాచారం. వివరాల ప్రకారం.. తమిళనాడులో ఎన్ఐఏ సోదాలు శనివారం తెల్లవారుజాము నుంచే కొనసాగుతున్నాయి. చెన్నై, మధురై పట్టణాలతో సహా 25 ప్రాంతాల్లో సోదాలు జరుగుతున్నాయి. ఎనిమిది మండలాల్లో ఎన్ఐఏ అధికారులు ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. కాగా, కోయంబత్తూరులో 2021 నాటి కారుబాంబు కేసుకు సంబంధించి ఈ సోదాలు జరుగుతున్నట్టు సమాచారం.




# 2.75 లక్షల కోట్లతో ఓట్ ఆన్ అకౌంట్ తెలంగాణ బడ్జెట్

## ప్రవేశపెట్టిన మంత్రి భట్టి

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను మంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. రూ.2,75,891 కోట్లతో బడ్జెట్‌ను ప్రతిపాదించారు. ఇందులో రెవెన్యూ వ్యయం రూ.2,01,178 కోట్లు కాగా, మూలధన వ్యయం రూ.29,669 కోట్లు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల అమలుకు రూ. 53,196 కోట్లు ప్రతిపాదించినట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ కేటాయింపు ఒక ప్రాథమిక అంచనా ప్రకారం మాత్రమే చేయడం జరిగిందన్నారు. హామీలకు సంబంధించిన విధివిధానాలను రూపొందించే పని ఇంకా కొనసాగుతున్నందున, అది పూర్తయిన వెంటనే అమలుకు అవసరమైన పూర్తి నిధులు కేటాయిస్తాం అని విక్రమార్క తెలిపారు. శాసన మండలిలో మంత్రి శ్రీధర్‌బాబు బడ్జెట్‌ను చదివి వినిపించారు.

**అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్.. బడ్జెట్‌లో రూ.500 కోట్లు**

ప్రతి మండలంలో అధునాతన సౌకర్యాలు, అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి భట్టివిక్రమార్క ప్రకటించారు. కాలేజీ స్థాయిలో ఉద్యోగానికి అవసరమైన మేరకు కోర్సులను



ప్రవేశపెట్టి పోటీ ప్రపంచంలో తెలంగాణ విద్యార్థులు నెగ్గుకురాగల సమర్థతను సమకూరుస్తామన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.2,75,891 కోట్లతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఇందులో పైలెట్ ప్రాజెక్టుగా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటుకు రూ.500 కోట్లు ప్రతిపాదించారు. ఇక విద్యా రంగానికి రూ.21,389 కోట్లు ప్రతిపాదించారు. ఇందులో విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యను ప్రోత్సహించేందుకుగాను మౌలిక సదుపాయాల కల్పనకు రూ.500 కోట్లు కేటాయించారు. ఉన్నత విద్యా మండలిని ప్రక్షాళనల చేసి హయ్యర్ ఎడ్యుకేషన్‌లో ప్రమాణాలను మెరుగుపరుస్తామని చెప్పారు.

**గృహజ్యోతి పథకానికి రూ. 2,418 కోట్లు కేటాయింపు..**

రాష్ట్రంలోని అర్హులైన కుటుంబాలకు గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా అందించబోతున్నామని ఆర్థిక భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ పథకం అమలుకు ఇప్పటికే మంత్రివర్గ నిర్ణయం జరిగిందన్నారు. దాని అమలుకు కావాల్సిన సత్వర చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ పథకం అమలుకు బడ్జెట్‌లో రూ. 2,418 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఇక రాష్ట్రంలోని ట్రాన్స్‌కో, డిస్కమ్‌లకు రూ. 16,825 కోట్లు ప్రతిపాదిస్తున్నట్లు భట్టి తెలిపారు. రాష్ట్రంలోని రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని భట్టి స్పష్టం చేశారు.

**మహాలక్ష్మి గ్యారంటీ అమలులో మరో మైలు రాయి.**

- 60 రోజుల్లో 15 కోట్ల 21 లక్షల మహిళలు ఆర్టీసి బస్సుల్లో ఉచిత ప్రయాణం.
- రూ.535 కోట్ల ప్రయాణ ఛార్జీలు మహిళలకు ఆదా.

## తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు సోమవారానికి వాయిదా



తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు సోమవారానికి వాయిదా పడ్డాయి. సోమవారం ఉదయం 10 గంటలకు సమావేశాలు తిరిగి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు. అంతకుముందు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైన భట్టి ప్రసంగం మధ్యాహ్నం 1:20 గంటలకు ముగిసింది. అనంతరం సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.


## 2024-2025 ఓటాన్ అకౌంట్ బడ్జెట్ 2 లక్షల 75 వేల 891 కోట్లు

- ఆరు గ్యారెంటీల కోసం 53 వేల 196 కోట్లు అంచనా
- ద్రవ్య లోటు రూ. 32,557 కోట్లు
- రెవెన్యూ మిగులు రూ. 5,944 కోట్లు
- రెవెన్యూ వ్యయం రూ. 2,01,178 కోట్లు కేటాయింపు
- మూలధన వ్యయం రూ. 29,669 కోట్లు కేటాయింపు
- ఎస్సీ సంక్షేమం కోసం 21,874 కోట్లు కేటాయింపు
- ఎస్టీ శాఖకు రూ. 13,013 కోట్లు కేటాయింపు
- బీసీ సంక్షేమం కోసం రూ. 8000 కోట్లు కేటాయింపు
- మైనార్టీ సంక్షేమం కోసం రూ. 2,262 కోట్లు కేటాయింపు
- వైద్య రంగానికి రూ. 11,500 కోట్లు కేటాయింపు
- విద్యా రంగానికి రూ. 21,389 కోట్లు కేటాయింపు
- తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుకు రూ. 500 కోట్లు.
- యూనివర్సిటీలల్లో సదుపాయాలకు రూ.500 కోట్లు.
- పంచాయితీ రాజ్ శాఖకు రూ. 40,080 కోట్లు కేటాయింపు
- వ్యవసాయ శాఖకు రూ.19,746 కోట్లు కేటాయింపు
- నీటి పారుదుల శాఖకు రూ. 28.024 కోట్లు
- మున్సిపల్ శాఖకు రూ. 11,692 కోట్లు
- విద్యుత్ గృహ జ్యోతి పథకానికి రూ. 2,418 కోట్లు
- విద్యుత్ సంస్థలకు రూ. 16,825 కోట్లు
- పరిశ్రమల శాఖకు రూ. 2,543 కోట్లు
- ఐటీ శాఖకు రూ. 774 కోట్లు




## రూ. 2 లక్షల రుణమాఫీపై త్వరలోనే..

రైతుల రుణమాఫీపై డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క కీలక ప్రకటన చేశారు. శాసనసభలో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా భట్టి రైతు రుణమాఫీపై మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు హామీ ఇచ్చిన విధంగానే రైతు రుణమాఫీ పథకాన్ని అమలు చేయబోతున్నామని తెలిపారు. రూ. 2 లక్షల రుణమాఫీపై త్వరలోనే కార్యాచరణ ఉంటుందని స్పష్టం చేశారు. అందుకు విధివిధానాలను రూపొందిస్తున్నాం. ప్రతి పంటకు మద్దతు ధర కూడా అందిస్తామన్నారు.



## పాకిస్థాన్ లో హంగ్ ఫలితం

పాకిస్థాన్ జాతీయ అసెంబ్లీ ఎన్నికల్లో 266 స్థానాలకు గానూ 265 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. 133 స్థానాల్లో ఎవరు గెలిస్తే వారే అధికారంలోకి వస్తారు. కానీ హంగ్ ఫలితం వచ్చింది. ఇమ్రాన్ ఖాన్ మద్దతుదారులు 99, భుట్టో పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ 53, మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ పార్టీ 71 స్థానాల్లో గెలుపొందింది. దీంతో మ్యాజిక్ ఫిగర్ ను ఎవరూ చేరకపోవడంతో హంగ్ ఏర్పడింది.



## దేవరతో మరో హీరోయిన్ శృతి మరాఠే టాలీవుడ్ కి పరిచయం?

టాలీవుడ్ కి పరిచయం అవుతున్న సంగతి తెలిసిందే. ఇక ఇప్పుడు మరో ఇంట్రెస్టింగ్ టాక్ ఏమిటంటే ఈ చిత్రంలో మరో హీరోయిన్ కూడా ఉంటుందట. అది కూడా మరాఠీ బ్యూటీ శృతి మరాఠే ఈ చిత్రంలో మరో హీరోయిన్ గా నటిస్తుంది అని లేటెస్ట్ టాక్. దీనితో ఈమె కూడా ఈ చిత్రంతో టాలీవుడ్ కి పరిచయం అవుతుంది అని చెప్పాలి. మరి ఈ అంశం పై అఫీషియల్ క్లారిటీ ఇంకా రావాల్సి ఉంది. ఇక ఈ చిత్రానికి అనిరుద్ సంగీతం అందిస్తుండగా ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మాణం వహిస్తున్నారు.



# 27 ఏళ్ల యువకుడు.. రూ.9,100 కోట్లకు అధిపతి!

'మన చుట్టూ ఎన్నో సమస్యలున్నాయి.పెద్దయ్యాక వాటికి పరిష్కారం వెతకాలి.' - ఒకప్పటి పిల్లలు ఇలాగే ఆలోచించేవారు. కానీ నేటితరంవాళ్లు పెద్దయ్యేదాకా ఆగాలనుకోవడం లేదు. టెక్నాలజీతో అద్భుతాలు చేస్తున్నారు. అలాంటి వారిలో 27 ఏళ్ల పెరల్ కపూర్ ఒకరు. అప్పుడప్పుడే సంపాదనవైపు అడుగులు వేసే సమయంలో ఓ కంపెనీని స్థాపించారు. అనతి కాలంలో భారత్‌లోనే అత్యంత పిన్న వయస్కుడైన బిలియనీర్‌గా చరిత్ర సృష్టించాడు. ఆంత్రప్రెన్యూర్‌లకు భారత్ స్వర్గధామంగా మారుతోంది. గత కొన్నేళ్లుగా మన దేశంలోనూ యూనికార్న్ కంపెనీల హవా నడుస్తోంది. ఒకప్పుడు యూనికార్న్ హోదా సాధించేందుకు దశబ్దాల తరబడి ఎదురు చూసిన స్టార్టప్‌లు ఇప్పుడు నెలల వ్యవధిలోనే యూనికార్న్‌లుగా మారిపోతున్నాయి. వ్యాపారంలో రయ్ రయ్ మంటూ దూసుకుపోతున్నాయి. పెరల్ కపూర్ 'జైబర్ 365' అనే స్టార్టప్ సంస్థ కూడా అంతే. గత ఏడాది మేలో తన కార్యకలాపాల్ని ప్రారంభించిన ఈ సంస్థ వెబ్3, ఏఐ ఓఎస్ ఆధారిత సేవల్ని అందిస్తుంది. ప్రారంభమైన కొద్ది కాలంలో భారత్, ఆసియా దేశాల్లో ఫాస్టెస్ట్ యూనికార్న్ కంపెనీగా అవతరించింది.



# ఎవరీ ఆకాష్ దీప్..?

## ఇప్పుడు టీమిండియాలోకి ఎంట్రీ?

27 ఏళ్ల ఆకాష్ ఆకాష్ దీప్ బీహార్‌లోని ససారం అనే గ్రామంలో జన్మించాడు. ఆకాష్‌ది మధ్యతరగతి కుటంబం. అతడు తన చిన్నతనం నుంచే క్రికెట్‌పై మక్కువ ఎక్కువ. క్రికెట్ వైపు అడుగులు వేస్తున్న సమయంలో దీప్ జీవితంలో ఊహించని విషాదం చోటు చేసుకుంది. అతడి తండ్రి మరణించాడు. ఆ తర్వాత కొద్ది రోజులకే అతడి సోదురుడు కూడా తుదిశ్వాస విడిచాడు. ఇన్ని కష్టాలు ఎదుర్కొన్నప్పటికీ ఆకాష్ మాత్రం దృడ సంకల్పంతో తన కెరీర్ వైపు అడుగులు వేశాడు. తన సొంత రాష్ట్రం బిహార్‌లో అవకాశాలు తక్కువగా ఉండటంతో వెస్ట్‌బెంగాల్‌కు తన మకాం మార్చాడు. అక్కడకు వెళ్లాక అసన్సోల్‌లోని ఓ క్రికెట్ ఆకాడమీలో దీప్ చేరాడు. ఆ తర్వాత అసన్సోల్‌లోని ఖేప్ క్రికెట్' టెన్నిస్ బాల్ టోర్నీలో అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. ఈ టోర్నీలో మెరుగైన ప్రదర్శన చేయడంతో దుబాయ్ వెళ్లే అవకాశం వచ్చింది. అక్కడ కూడా ఆకాష్ దుమ్మురేపాడు. ఆ తర్వాత బెంగాల్ క్రికెట్ అసోషియేషన్ డివిజన్ మ్యాచ్‌ల్లో ఆడే ఛాన్స్ లభించింది. ఓ సారి కోల్‌కతాలోని రేంజర్స్ గ్రౌండ్‌లో మ్యాచ్ జరుగుతున్నప్పుడు అప్పటి బెంగాల్ సీనియర్ టీమ్ డైరెక్టర్ జోయ్‌దీప్ ముఖర్జీ దృష్టిలో ఆకాష్ దీప్ పడ్డాడు. ఆకాష్ దీప్ బౌలింగ్ చేస్తున్నప్పుడు కీపర్ స్టంప్‌ల వెనుక 10 గజాల దూరంలో నిల్చోడం చూసి జోయ్‌దీప్ ముఖర్జీ ఆశ్చర్యపోయారు. వెంటనే అండర్-23 కోచ్ సౌరాశిష్‌ను పిలిపించి ఆకాష్ దీప్ గురించి తెలుసుకున్నాడు. ఈ క్రమంలో అప్పటి బెంగాల్ క్రికెట్ అసోషియేషన్ ప్రెసిడెంట్ సౌరవ్ గంగూలీ విజన్ 2020 పోగ్రాంకు దీప్‌ను ముఖర్జీ రిఫర్ చేశాడు. ఇదే అతడి కెరీర్‌కు టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది. సౌరవ్ గంగూలీ విజన్ 2020 పోగ్రాంకు షార్ట్‌లిస్ట్ చేసిన జాబితాలో ఆకాష్‌కు చోటు దక్కింది. దీంతో బెంగాల్ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించేందుకు నిర్వహించిన ట్రయల్స్‌లో ఆకాష్ పాల్గొనున్నాడు. ఆ తర్వాత 2019లో బెంగాల్ తరపున ఆకాష్ దీప్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అడుగుపెట్టాడు. అదే ఏడాది ఫస్ట్‌క్లాస్ క్రికెట్, టీ20ల్లో అరంగేట్రం చేశాడు. ఓవరాల్‌గా క్రికెట్‌లో ఇప్పటివరకు 29 మ్యాచ్‌లు ఆడిన ఆకాష్ 103 వికెట్లు పడగొట్టాడు. ఇక ఐపీఎల్‌లో ప్రస్తుతం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఐపీఎల్-2022 మెగా వేలంలో రూ.20 లక్షల కనీస ధరకు అతడిని ఆర్సీబీ కొనుగోలు చేసింది.



# ట్రూ లవర్ రివ్యూ

మణికందన్ – గౌరీప్రియ జంటగా ప్రభురామ్ వ్యాస్ దర్శకత్వంలో తమిళ్ లో తెరకెక్కిన 'లవర్' సినిమాని, తెలుగులో మారుతి, SKN 'ట్రూ లవర్' పేరుతో ఈ రోజు రిలీజ్ చేశారు. మరి, ప్రేక్షకులను ఈ చిత్రం ఏ మేరకు మెప్పించిందో సమీక్షలోకి వెళ్లి తెలుసుకుందాం ! అరుణ్ (మణికందన్), దివ్య (గౌరి ప్రియ) కాలేజీ రోజుల్లో నుంచే ప్రేమలో ఉంటారు. అలా ఆరేళ్లుగా గడిచిపోతాయి. దివ్య ఒక సాఫ్ట్వేర్ కంపెనీలో జాబ్ చేస్తూ ఉంటుంది. కానీ, అరుణ్ మాత్రం ఇంట్లో 15 లక్షలు తీసుకుని ఒక కాఫీ షాప్ పెట్టడానికి ప్రయత్నాలు చేస్తూ, మరోవైపు తాగుతూ టైమ్ పాస్ చేస్తుంటాడు. ఈ క్రమంలో జరిగిన కొన్ని నాటకీయ సంఘటనల అనంతరం.. వీరిద్దరి మధ్య ఎలాంటి గొడవలు వచ్చాయి ?, దూరం అవుతూనే ఎలా దగ్గర అయ్యారు ?, ఈ లోపు దివ్య తన తోటి ఉద్యోగస్తులతో కాస్త క్లోజ్ గా ఉండడం అరుణ్ కి ఎందుకు నచ్చదు ?, చివరికి వీళ్లిద్దరు కలిశారా ?, విడిపోయారా?, ఇంతకీ.. కేఫ్ పెట్టాలన్న అరుణ్ కల నెరవేరిందా ? లేదా ? అనేది మిగిలిన కథ. చిన్న చిన్న విషయాలకే అపోహలతో – అపార్థాలతో లవర్స్ ఎలా గొడవ పడతారు ?, వారి మధ్య ఎలాంటి డ్రామా నడుస్తోంది ?, అసలు ఈ జనరేషన్ ప్రేమ కథలు ఎలా ఉన్నాయి ? అనే కోణంలో దర్శకుడు ప్రభురామ్ వ్యాస్ రాసుకున్న కొన్ని సన్నివేశాలు బాగున్నాయి. లవర్స్ మధ్య జన్యూన్ ఎమోషన్ ఉంటే ఎంత బాగుంటుందో దర్శకుడు ఈ సినిమాలో చాలా చక్కగా చూపించాడు. మళ్లీ అంతలోనే ఆ పాత్రల మధ్యనే గొడవలను, కన్నీళ్లను మరియు అభిమానాలతో కూడుకున్న ఆత్మాభిమానాలను కూడా బాగానే ఎస్టాబ్లిష్ చేశాడు. మొత్తానికి ఈ 'ట్రూ లవర్' సినిమాలో వాస్తవ పరిస్థితులు.. అలాగే సగటు కుర్రాళ్ల భావోద్వేగాలు బాగున్నాయి. ఇక నటన విషయానికి వస్తే.. హీరోగా నటించిన మణికందన్ తన కామెడీ టైమింగ్ తో అండ్ తన ఎమోషనల్ యాక్టింగ్ తో బాగా నటించాడు. సినిమాలోని కోర్ ఎమోషన్ని మణికందన్ తన హావభావాలతోనే బాగా పలికించాడు. అలాగే హీరోయిన్ శ్రీ గౌరీ ప్రియ కూడా చాలా బాగా నటించింది. ఇక కన్నా రవితో పాటు మిగిలిన ప్రధాన పాత్రధారులు కూడా తమ పాత్రలకు పూర్తి న్యాయం చేశారు. దర్శకుడు ప్రభురామ్ వ్యాస్ తీసుకున్న కథాంశం బాగున్నప్పటికీ.. కథనం మాత్రం కొన్ని చోట్ల సింపుల్ గా సాగుతుంది. ముఖ్యంగా సెకండ్ హాఫ్ లో కొన్ని చోట్ల స్క్రీన్ ప్లే ఇంట్రెస్ట్ కలిగించలేని ట్రీట్మెంట్ తో బాగా స్లోగా సాగుతుంది. ఇక హీరోహీరోయిన్ల మధ్య ఉన్న కొన్ని లవ్ సీన్స కూడా చాలా రెగ్యులర్ గానే ఉంటాయి. దీనికితోడు దర్శకుడు ప్రభురామ్ వ్యాస్ లవర్స్ మధ్య రిలేషన్ ను దృష్టిలో పెట్టుకుని అనవసరమైన రిపీటెడ్ సన్నివేశాలను జోడించాడు. పైగా కథకు బలం పెంచలేని లవ్ అండ్ ఫ్యామిలీ సీన్స్ ఎక్కువైపోయాయి. అలాగే, కొన్ని ఓవర్ డ్రామా సీన్స్ కూడా సినిమాకి బలహీనతగా నిలుస్తాయి. మొత్తానికి దర్శకుడు ప్రభురామ్ వ్యాస్ తాను అనుకున్న కంటెంట్ ను స్క్రీన్ మీద బాగా ఎలివేట్ చేసినా.. సినిమాలో కొన్ని రొటీన్ సీన్స్ ను ట్రిమ్ చేసి వుంటే సినిమాకి ప్లస్ అయ్యేది. సాంకేతిక నిపుణుల గురించి మాట్లాడుకుంటే.. ప్రభురామ్ వ్యాస్ దర్శకుడిగా మంచి కథాంశంతో ఆకట్టుకున్నాడు. అలాగే, ఆయన రాసుకున్న కొన్ని కీలక సన్నివేశాలు కూడా బాగున్నా.. పూర్తి స్థాయిలో ఆయన ఆకట్టుకోలేకపోయారు. సంగీత దర్శకుడు సీన్ రోల్డన్ అందించిన పాటలు బాగున్నాయి. అదే విధంగా బ్యాక్ గ్రౌండ్ స్కోర్ కూడా కొన్ని కీలక సన్నివేశాల్లో బాగుంది. ఎడిటర్ అనవసరమైన సీన్స్ ని ఇంకా టైట్ గా ట్రీమ్ చేసి ఉండి ఉంటే, సినిమాకి ప్లస్ అయ్యేది. శ్రేయాస్ కృష్ణ సినిమాటోగ్రఫీ బాగుంది. ఫైనల్ గా నిర్మాతలు 'నజెరత్ పసిలియన్, మగేష్ రాజ్ పాసిలియన్, యువరాజ్ గణేశన్' పాటించిన నిర్మాణ విలువలు బాగున్నాయి. 'ట్రూ లవర్' అంటూ వచ్చిన ఈ లవ్ డ్రామాలో.. లవర్స్ మధ్య అపోహలను – అపార్థాలను, అలాగే గొడవలను – బాధలను కూడా బాగా ఎస్టాబ్లిష్ చేశారు. కొన్ని ఎమోషనల్ సీన్స్ తో పాటు కొన్ని కామెడీ సీన్స్ కూడా ఆకట్టుకున్నాయి. అయితే, రెగ్యులర్ లవ్ సీన్స్, ఇంట్రెస్ట్ కలిగించలేని స్క్రీన్ ప్లే వంటి అంశాలు సినిమాకి మైనస్ గా నిలిచాయి. ఓవరాల్ గా ఈ సినిమాలోని కొన్ని ఎలిమెంట్స్ యూత్ కు కనెక్ట్ అవుతాయి.



# రోహిత్ శర్మ కీలక నిర్ణయం.. త్వరలోనే ప్రకటన!?

ఐపీఎల్-2024 సీజన్ ఆరంభానికి ముందు టీమిండియా కెప్టెన్, ముంబై ఇండియన్స్ మాజీ సారథి రోహిత్ శర్మ ఓ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీతో రోహిత్ తెగదింపులు చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. కాగా రెండు నెలల క్రితం తమ జట్టు కెప్టెన్సీ నుంచి రోహిత్ శర్మను ముంబై ఇండియన్స్ తొలిగించిన సంగతి తెలిసిందే. రోహిత్ స్థానంలో స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాను గుజరాత్ టైటాన్స్ నుంచి ట్రేడ్ చేసుకుని మరి జట్టు పగ్గాలను ముంబై అప్పగించింది. ఈ నిర్ణయం రోహిత్ అభిమానులకు ఆగ్రహాన్ని తెప్పించింది. ఐదు సార్లు ఛాంపియన్‌గా నిలిపిన కెప్టెన్ పట్ల ముంబై వ్యవహరించిన తీరుపై విమర్శలు పెద్ద ఎత్తున వెల్లువెత్తాయి. తాజాగా ఇదే విషయంపై ముంబై ఇండియన్స్ హెడ్‌కోచ్ మార్క్ బౌచర్ మాట్లాడుతూ.. ఇది పూర్తిగా క్రికెట్‌కు సంబంధించిన నిర్ణయం. రోహిత్ శర్మపై ఒత్తిడి తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నాం. రోహిత్‌పై వర్క్ లోడ్ తగ్గిస్తే.. అతడు స్వేచ్ఛగా బ్యాటింగ్ చేయగలడని మేము భావిస్తున్నాముని చెప్పుకొచ్చాడు. అయితే బౌచర్ వ్యాఖ్యలపై రోహిత్ శర్మ భార్య రితికా సజ్దే స్పందించింది. ఇందులో చాలా వరకు తప్పులే మాట్లాడారంటూ ఆమె కామెంట్ చేసింది. ప్రస్తుతం ఆమె చేసిన కామెంట్ క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. అయితే రితికాతో పాటు హిట్‌మ్యాన్ కూడా ముంబై ఫ్రాంచైజీ పట్ల అసంతృప్తితో ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఫ్రాంచైజీ మారాలని రోహిత్ భావిస్తున్నట్లు వినికిడి. ఐపీఎల్-2024 మినీ వేలం తర్వాత తిరిగి ట్రేడింగ్ విండో ఓపెన్ అయింది. ఈ ఏడాది సీజన్ ఆరంభానికి ఒక నెల ముందు వరకు ట్రేడింగ్ విండో అందుబాటులో ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇతర ఫ్రాంచైజీలు హిట్‌మ్యాన్‌తో సంప్రదింపులు జరిపే ఛాన్స్ ఉంది. మరోవైపు రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా మధ్య కూడా విభేదాలు తలెత్తినట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఒకరినొకరు సోషల్ మీడియాలో ప్లాట్ ఫామ్స్‌లో అన్ ఫాలో కూడా చేసినట్లు పలు రిపోర్ట్‌లు పేర్కొంటున్నాయి.

# ఏపీలో పొత్తులపై ఇప్పుడేమీ మాట్లాడలేం



ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీతో పొత్తు కోసం తెగ వెంపర్లాడుతున్న టీడీపీకి ఏం జరుగుతుందో అన్న భయంలో కొనసాగుతూనే ఉంది. ఢిల్లీ నుంచి ఏం కబురు వస్తుంది? తమతో పొత్తుకు కమలనాథులు ఒప్పకుంటారా? లేక తిరస్కరిస్తారా అన్న డోలాయమానంలో కొట్టుమిట్టాడుతున్నాడు చంద్రబాబు. ఈ లోగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా నర్మగర్భంగా చేసిన కొన్ని వ్యాఖ్యలు టిడిపిలో గుబులు రేపుతున్నాయి.

**అమిత్‌షా ఏమన్నాడు?**

శనివారం కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ రాజకీయాలు, వేర్వేరు రాష్ట్రాల్లో పొత్తుల గురించి మీడియాతో మాట్లాడారు. ఉత్తరాదిన మెజార్టీ రాష్ట్రాల్లో ఒంటరిగా పోటీ చేయనున్న బీజేపీ.. దక్షిణాదిన మాత్రం నమ్మదగ్గ, విశ్వసనీయమైన మిత్రుల కోసం చూస్తోంది. దీనికి సంబంధించి మాట్లాడిన అమిత్‌షా.. ఇప్పటికిప్పుడు ఏపీలో పొత్తులపై ఏమీ మాట్లాడలేమన్నారు. ఇది ఓ రకంగా చంద్రబాబు & కోకు నిరాశ కలిగించేదే. సుదీర్ఘంగా వెయిట్ చేసి ఢిల్లీలో అమిత్‌షాను కలిసిన చంద్రబాబు.. వీలైనంత వేగంగా పొత్తుల ప్రక్రియ కొనసాగించాలన్న ఆత్రుతలో ఉన్నాడు. అయితే అమిత్‌షా మాత్రం అంత వేగిరపాటు ఎందుకన్నట్టుగా సంకేతాలిస్తున్నారు.



# అలాంటి సినిమాలు చెయ్యను

తాప్సీ
పన్ను.. 'ఝుమ్మంది నాదం'
సి...
పరిచ...
ముద్దుగుమ...
హిట్ చిత్రాల్లో...
తెలుగుతో పాటు...
మలోనూ సత్తా చా...
బాలీవుడ్ లోకి అడు...
వరుస సినిమాల్లో నట...
నయంతో హిందీ చిత్ర...
తెచ్చుకుంది. తరచుగా ...
తాజాగా తాప్సీ పన్ను 'యానిమల్' మూవీని టార్గెట్ చేసింది. కాంగ్రెస్ ఎంపీ రంజీత్ రంజన్ 'యానిమల్' కంటెంట్ చాలా అభ్యంతరకరంగా ఉందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. పలువురు నటులు, చిత్ర ప్రముఖులు సైతం యానిమల్ కి వ్యతిరేకంగా గళం వినిపించారు. ఈ లిస్ట్ లో తాజాగా హీరోయిన్ తాప్సీ చేరింది. తానైతే 'యానిమల్' మూవీలో నటించనని పరోక్షంగా రష్మిక మందన్నకు చురకలు అంటించింది. "సినిమా నటులకు ఒక పవర్ ఉంటుంది. అదే సమయంలో బాధ్యత కూడా ఉంటుంది. అలా అని 'యానిమల్' లాంటి సినిమాల్లో నటించే వాళ్ళను నేను తప్పుబట్టడం లేదు.



# సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం

సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. గత ప్రభుత్వం హయాంలో చేపట్టిన ప్రాజెక్టుల నిర్మాణంలో లోపాలను పరిశీలించేందుకు ప్రభుత్వం నడుం బిగించింది.ఈ నెల 13వ తేదీన మేడిగడ్డ పర్యటనకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమౌతోంది. ఈ పర్యటనలో పాల్గొనాల్సిందిగా సీఎం రేవంత్ రెడ్డి అధ్వర్యంలో అన్ని పార్టీల ఎమ్మెల్యేలను ప్రభుత్వం ఆహ్వానించింది. ప్రాజెక్టు సందర్శనకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఆహ్వానించాలని నిర్ణయం తీసుకున్నారు. కేసీఆర్‌ను ఆహ్వానించే భాధ్యతను ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి అప్పగించారు. అసెంబ్లీ సమావేశాలను ఈ నెల 12వ తేదీతో ముగించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ఇరిగేషన్ శ్వేత పత్రం విడుదల చేయనున్నారు. ఈ నెల 12వ తేదీన అసెంబ్లీలో ఇరిగేషన్‌పై చర్చ జరగనుంది. విజిలెన్స్ ఇరిగేషన్ అంశాలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సభలో మాట్లాడనున్నారు.